క్లుప్తంగా

ఐరావత వాహనంపై రుక్మిణీ పాండురంగస్వామి



పామిడి: పట్టణంలోని రుక్మిణీ పాండురంగ స్వామి ఆషాఢ మాస బ్రహోత్సవాల్లో భాగంగా బుధవారం డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో పెద్ద విఠోబ దేవాలయంలో, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో చిన్న విఠోబ దేవాలయంలోనూ బుధవారం 5వ రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో రుక్మిణీ పాండురంగస్వామి విగ్రహాలను శోభాయానంగా అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో స్వాములవారిని ఐరావత వాహనంపై ఊరేగారు. స్థానిక భావసార క్షత్రియ భజన మండలి సారథ్యంలో రుక్మిణీ పాండురంగస్వామిని దిండి భజనల నడుమ పురవీధుల్లో నగర ప్రదర్శన గావించారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవ దృశ్యం

పామిడి: పట్టణంలోని చిన్న విఠోబ దేవాలయంలో ఆషాడ మాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు వెంకటేశ్వరరావు దంపతుల ఆధ్వర్యంలో పెళ్ళి తంతు నిర్వర్తించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ ఈబీ దేవి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆలయ మెమొంటోను బహూకరించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులతో రోటరీక్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు

గుంతకల్లు రూరల్: మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వంకదారు ప్రదీప్‌కుమార్ సౌజన్యంతో రూ.20 వేల వ్యయంతో అందజేసిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం మరియమ్మ సూచించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుధీర్ కార్వా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. రోటరీక్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం కోసం బొడ్రాయికి అభిషేకం



బొడ్రాయికి అభిషేకం చేస్తున్న రైతులు

గుంతకల్లుటౌన్: వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ పాత గుంతకల్లుకు చెందిన రైతులు బొడ్రాయికి పూజలు చేశారు. బుధవారం ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజల అనంతరం రైతులు బొడ్రాయిని పూలతో అలంకరించి 116 బిందెల నీటితో అభిషేకం చేశారు. పంటల సాగుకు అదును దాటిపోతుండటంతో వరుణ దేవుడి కరుణతో పాటు ప్రజలు సుఖసంతోషాలతో వర్థిల్లాలని పూజలు చేసినట్లు రైతులు తెలిపారు.

బస్సు సర్వీసు ప్రారంభం

గుంతకల్లుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోల గుంతకల్లు–కట్టకిందపల్లి నూతన బస్సు సర్వీసును ఆర్టీసీ కడప జోనల్ చైర్మన్ పూల నాగరాజు బుధవారం ప్రారంభించారు. ఆర్టీసీ డీఎం కె.వి. గంగాధర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

శుద్ధి నీరు సరఫరా చేయండి



ఫిల్టర్‌బెడ్స్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: పురప్రజలకు శుద్ధిచేసిన నీటినే సరఫరా చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని సూచించారు. బుధవారం ఆమె అధికారులతో కలిసి సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీటి నిల్వలు, ఫిల్టర్ బెడ్స్, వాటర్ ప్యూరిఫైడ్ సెంటర్లను పరిశీలించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని, పైప్‌లైన్ లీకేజీ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు. డీఈ షబానా, ఏఈ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థం.. ప్రజారోగ్యానికి అనర్థం!

- వ్యర్థాల మయంగా రింగ్ రోడ్డు
- వాహనదారులకు అడ్డంగా పందులు
- పట్టించుకోని అధికారులు



రింగ్ రోడ్డుకు ఇరువైపులా గుట్టలుగా ఉన్న వ్యర్థాలు



పందుల స్వైర విహారం ఇలా..

తాడిపత్రి రూరల్: తాడిపత్రి రింగ్‌రోడ్డు వ్యర్థాలమయంగా మారుతోంది. పట్టణంతోపాటు సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో పెరుగుతున్న భవన నిర్మాణాల వల్ల వస్తున్న పెద్ద ఎత్తున వ్యర్థాలను వివిధ వాహనాల్లో తీసుకువచ్చి రింగ్‌రోడ్డుకు ఇరువైపులా పారవేస్తున్నారు. ఈ వ్యర్థాలు గుట్టలుగా మారుతూ వాహనదారులకు ఇబ్బందులను కలుగజేస్తున్నాయి. వ్యర్థాలను నియంత్రించడంలో అధికారులు విఫలమవుతున్నారు. భవన నిర్మాణాల వ్యర్థాలతో పాటు జంతువుల కళేబరాలు, చికెన్ సెంటర్ల యజమానులు కోళ్లకు సంబంధించిన వ్యర్థాలు, ఇళ్లల్లోని పనికిరాని వస్తువులు సైతం రింగ్ రోడ్డు పక్కన పడవేస్తున్నారు. గన్నెవారిపల్లి కాలనీ పరిధిలోని రింగ్‌రోడ్డు ఇరువైపులా మురుగు నీరు నిల్వ ఉంటోంది. మురుగు నీటికి తోడు అందులో పందులు ఉంటున్నాయి. మురికినీటిలో జంతు వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతుండటంతో వాహన చోదకులు ముక్కులు మూసుకుని వాహనాలను డ్రైవింగ్ చేస్తున్నారు.

ట్రాఫిక్‌ను మళ్లించేందుకు రింగ్ రోడ్డు

తాడిపత్రి పరిసర ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోంది. భారీతోపాటు చిన్నతరహా పరిశ్రమలు, యూనిట్లు విస్తరిస్తున్నాయి. తాడిపత్రి పట్టణం మూడు జిల్లాల కేంద్రంగా ఉంటోంది. దీని కారణంగా రోజు రోజుకూ భారీ వాహనాలతో పాటు కార్లు, మోటర్ సైకిళ్ల సంఖ్య పెరుగుతోంది. వీటి కారణంగా పెద్ద ఎత్తున ట్రాఫిక్ సమస్య ఏర్పతుండటంతో రింగ్‌రోడ్డును ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాతోపాటు గుత్తి ప్రాంతం నుంచి అనంతపురం వైపు వెళ్లడానికి నంద్యాల రోడ్డులోని పాత బ్రిడ్జి నుంచి శివాలయం, కొత్త బ్రిడ్జి, శ్రీనివాసపురం మీదుగానూ, కడప ప్రాంతం నుంచి వచ్చే వాహనాలు అనంతపురం వైపు వెళ్లడానికి ఐశ్వర్య విల్లాస్, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం, రైల్వే గేట్, ఆటోనగర్ మీదుగా వెళ్లడానికి వీలు కల్పిస్తూ రింగ్ రోడ్డును ఏర్పాటు చేశారు. ఐశ్వర్య విల్లాస్ నుంచి ఆటోనగర్ వరకూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.20కోట్ల వ్యయంతో దాదాపు ఐదు కిలోమీటర్ల తారురోడ్డు ఏర్పాటు చేశారు. తాడిపత్రి పట్టణానికి ఇరువైపులా ఉన్న రింగ్ రోడ్డు వ్యర్థాలతో నిండి ఉండటం పట్ల వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రింగ్ రోడ్డుకు ఇరువైపులా కొత్తగా హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి. వ్యర్థాలు, జంతు కళేబరాల వల్ల వచ్చే దుర్వాసనతో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

తాడిపత్రి మునిసిపాలిటీ, పంచాయతీల పరిధిలో భవనాలను తొలగించాలంటే తప్పనిసరిగా అధికారుల అనుమతి తీసుకోవాలి. కూల్చివేయగా వచ్చిన వ్యర్థాల శాతం ఏ మేరకు ఉంటుందో, వాటిని ఎక్కడ వేస్తారో తప్పనిసరిగా భవనాల యజమానులు అధికారులకు లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలి. పరిశీలించిన అధికారులు వ్యర్థాలను ఎక్కడ వేయాలో సూచిస్తారు. కానీ ఏ యజమాని కూడా ఈ నిబంధనలను పాటించడం లేదు. అధికారులు సైతం పెద్ద ఎత్తున వ్యర్థాలను రింగ్ రోడ్డుకు ఇరువైపులా గుట్టలుగా వేస్తున్నా పట్టించుకోవడం లేదు.

ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు

రింగ్‌రోడ్డులోని ప్లాస్టిక్ వ్యర్థాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెడుతున్నారు. నిప్పు ద్వారా వస్తున్న పొగ ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టణ, రూరల్ పరిధిలోని వాణిజ్య, వ్యాపారులు ప్లాస్టిక్ వ్యర్థాలను రింగ్‌రోడ్డులోని పలు ప్రాంతాల్లో వేస్తున్నారు. ఈ వ్యర్థాలను కాల్చివేస్తుండటంతో పెద్ద ఎత్తున పొగ వస్తోంది. ప్రస్తుతం సీజన్ వ్యాధులు ప్రారంభం కావడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వాయు కాలుష్యం తోడు కావడంతో అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



గుంతకల్లులో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

గుంతకల్లు రూరల్: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో బీఎల్వోలదే కీలక పాత్ర అని, బీఎల్వోలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. బుధవారం స్థానిక శంకరానందగిరి డిగ్రీ కళాశాలలో బీఎల్వోల విధులపై ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి ఆర్డీఓతోపాటు తహసీల్దార్ రమాదేవి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఓటు హక్కు ఎంత ముఖ్యమో ఆ ఓటు హక్కును నమోదు చేసే బీఎల్వోలకు అంతే ప్రాముఖ్యత ఉందన్నారు. ఆరు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు బీఎల్వోలకు ఎంతో కీలకమన్నారు. ఓటు హక్కు నమోదు ప్రక్రియలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లే బీఎల్వోలు విధిగా ఐడీ కార్డులు ధరించాలన్నారు. ప్రజల సందేహాలకు సరైన సమాధానం చెబుతూ కొత్తగా ఓటు హక్కు నమోదు, ఓటర్ల తొలగింపు, ఓటు హక్కును ఇతర ప్రాంతాలకు మార్చడం, విద్య, ఉద్యోగం కోసం విదేశాల్లో ఉంటున్న వారి వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నారాయణ స్వామి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్

గుంతకల్లు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని దుర్వినియోగం కాకుండా చూడాలని డీఎస్పీ ఆముదాల శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అనవసరంగా కొంతమంది తప్పుడు అట్రాసిటీ కేసులతో ఇరికించడానికి పూనుకోవడం వల్ల అమాయకుల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. క్షేత్రస్థాయి నుంచి బాధితులకు న్యాయం చేస్తూ పరిహారం అందేలా కృషి చేయడం పాటు చట్టాన్ని దుర్వినియోగం కాకుండా చూసే బాధ్యత మీపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ హరిప్రసాద్, సాకే గోవిందు, కావలి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

పశువుల దొంగలపై నిఘా ఉంచండి



కసాపురం ఎస్ఐకి సమస్యను విన్నవిస్తున్న రైతులు

గుంతకల్లు రూరల్: ఇళ్ల ముందు కట్టి ఉంచిన పశువులు గత కొన్ని నెలలుగా తరచూ అపహరణకు గురవుతున్నాయంటూ దాదాపు 10 మంది రైతులు బుధవారం కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామికి ఫిర్యాదు చేశారు. బాధిత రైతులు విజయ్‌కుమార్, దేవేంద్ర, మారెప్ప, అంజి, నారాయణ, ఈరన్న, బాలక్రిష్ణ, సంజీవ్ తదితరులు మాట్లాడుతూ గుంతకల్లు పట్టణంలోని సంతోష్ నగర్, సత్యనారాయణ పేట, వాల్మీకి నగర్, చెన్నప్ప కొట్టాల, పాత గుంతకల్లు, పోర్టర్‌లైన్ తదితర ప్రాంతాల్లో రాత్రి పూట ఇళ్ల ముందు కట్టి ఉంచిన ఆవులు, ఎద్దులు, ఎనుములు తరచూ అపహరణకు గురవుతున్నాయన్నారు. గడచిన నాలుగు నెలల్లోనే 40 పైగా పశువులు అపహరణకు గురయ్యాయన్నారు. పోలీసులు స్పందించి పశువుల దొంగలను పట్టుకుని న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలి



గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు



తాడిపత్రి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

సాక్షి నెట్‌వర్క్: కేంద్రంలోని మోదీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని మండల కేంద్రాల్లో సమ్మె చేపట్టారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఎల్ఐసీ, పోస్టల్, బ్యాంక్ తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి మద్దతుగా వైఎస్సార్‌సీపీ కార్మిక సంఘం, అంగన్‌వాడీ, ఆశ, మున్సిపల్, విద్యుత్ కార్మికులు, సీపీఎం, సీపీఐ, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, సీఐటీయూ తదితర పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను ఉక్కుపాదంతో అణచివేసిందన్నారు. కార్మికులకు కనీసవేతనం కింద నెలకు రూ.26 వేల వేతనమివ్వాలన్నారు. ఎన్‌పీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఖాళీలను భర్తీ చేయాలని, బ్యాంకుల సామాన్య ఖాతాదారులకు సర్వీస్ చార్జీలను తగ్గించాలని, బడా కార్పొరేట్ వ్యక్తుల మొండి బకాయిల వసూలుకు కఠిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. రైతు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అన్నారు. రైతుల అనుమతులు లేకుండా సోలార్ ప్రాజెక్ట్‌లకు భూములను కేటాయించరాదన్నారు. రైతులకు నష్ట పరిహారం వెంటనే అందించాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు, గంపలు, మెడికల్ కిట్‌లు అందించాలని, హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టిన దేశవ్యాప్త సమ్మెతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



వైవీఆర్, నైరుతీరెడ్డిలను సత్కరిస్తున్న కొంగనపల్లి నాయకులు



మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ పామిడి అధ్యక్షుడు స్వామినాయక్

గుంతకల్లు రూరల్: కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి, సూచించారు. మండలంలోని కొంగనపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం మాజీ ఎమ్మెల్యేతోపాటు పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతీరెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో కొంగనపల్లి గ్రామం నుంచే 14 మంది నాయకులకు కీలకమైన పదవులు ఇచ్చిన నేపథ్యంలో బీసీ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు రంగనాయకులు ఆధ్వర్యంలో నాయకులు వైవీఆర్, నైరుతీరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు పెద్దినేని నాగార్జున, రవి, రంగయ్య, ప్రకాష్ గౌడ్, సురేంద్ర, ఎస్ మస్తాన్‌వలి, పెండేకంటి రాజు, కురువ గణేష్, ప్రసాద్, మునిరంగడు, కురువ జగదీష్, అప్పయ్య, సేన రాజేష్ పాల్గొన్నారు.

పామిడి: గుంతకల్లులో మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ పామిడి మండల నూతన అధ్యక్షుడు రమావత్ స్వామినాయక్ మర్యాద పూర్వకంగా కలిశారు. తన ఎంపికకు సహకరించిన మాజీ ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డితో పాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షురాలు వై నైరుతిరెడ్డికి, మండల పార్టీ శ్రేణులకందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు నాగూరు ఈశ్వర్‌రెడ్డి, రమావత్ రామకృష్ణనాయక్, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యూరియాను పిచికారీ చేయండి

గుంతకల్లు రూరల్/గుత్తి రూరల్: వర్షాభావం కారణంగా పంటలు వాడుముఖం పడుతున్న క్రమంలో బెట్టను అధిగమించేందుకు రైతులు యూరియాను పిచికారీ చేసుకోవాలని మండల అగ్రికల్చర్ ఆఫీసర్ లీనా వసుంధర సూచించారు. బుధవారం మండల పరిధిలోని అయ్యవారుపల్లి, నాగసముద్రం గ్రామాల్లో పొలం –పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ రకాల పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెగుళ్ల నివారణకు వాడాల్సిన మందులు, సమగ్ర సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలు ఎండిపోకుండా బెట్టను అధిగమించేందుకు లీటర్ నీటికి 10 గ్రాముల యూరియాను కలిపి ఎకరాకు 200 లీటర్లతో పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా 19 19 19 మందు లేదా 17 17 17 మందును లీటర్‌కు 8 గ్రాముల చొప్పున కలిపి ఎకరాకు 200 లీటర్ల నీటితో పిచికారీ చేసుకోవాలన్నారు.అలాగే గుత్తి మండలంలోని ఊబిచెర్ల గ్రామంలో బుధవారం గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడుతో కలిసి రెడ్డిపల్లి ప్రధాన శాస్త్రవేత్త కోనేరు లక్ష్మణ్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శాస్త్రవేత్త ఖరీఫ్ సీజన్‌లో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పంటలు సాగు చేసే ముందు ప్రతి రైతూ విత్తనశుద్ధి తప్పకుండా చేయాలన్నారు కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, వీహెచ్ఏ అజయ్, వీఏఏ సాగర్, రైతులు పాల్గొన్నారు.

ప్రభోదానంద ఆశ్రమంలో నేడు గురుపౌర్ణమి వేడుకలు

తాడిపత్రిటౌన్/శింగనమల: తాడిపత్రి మండలంలోని చిన్నపోలమడ గ్రామంలో ఉన్న ప్రభోధానంద ఆశ్రమంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు బుధవారం తెలిపారు. శ్రీలంక బౌద్ధ బిక్షువు కోవానే పారుతెరో, జపాన్ మాంక్ యూషీజీ ప్రసంగిస్తారన్నారు. అలాగే శింగనమలలోని షిర్డీసాయి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు.

ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయ ప్రాంగణంలో బుధవారం డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో బుధవారం పదో తరగతి ప్రతిభావంత భావసార క్షత్రియ కుల విద్యార్థులను నగదు బహుమతులతో ప్రోత్సహించారు. ఆ ఫిర్కా సమాజ్ కుల సంతర్పణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో అధ్యక్షుడు జే శ్రీనివాసరావు చేతులమీదుగా ఒక్కో విద్యార్థికి వెయ్యి రూపాయల చొప్పున 45 మందికి నగదు బహుతులు అందజేశారు. అనంతరం వెయ్యిమందికి అన్న సమారాధన గావించారు. కార్యక్రమంలో ఆసమాజ్ కమిటీ సభ్యులు, జీ రాజశేఖర్‌రావు, కే శ్రీనివాసరావు, అడ్వకేట్ దత్తు, జోజోడే కుమార్, కే వెంకటేశ్వరరావు, జగని రవి, ముకుందా, రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో కోళ్ల ఫారం వద్ద బుధవారం ఆటోను బైక్ ఢీ కొన్న ఘటనలో రమేష్ అనే వ్యక్తి గాయపడ్డాడు. బైక్‌లో గుత్తి నుంచి సొంతూరు పోతుదొడ్డికి బైక్ వెళ్తూ ముందు వెళుతున్న ఆటోను ఢీ కొన్నాడు. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జొన్నగిరిలో వృద్ధుడిపై దాడి

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామ శివారులో స్వర్ణయ్య అనే వృద్ధుడిపై బుధవారం కొందరు దాడి చేసి గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా బోగనంపాడు గ్రామానికి చెందిన స్వర్ణయ్య జొన్నగిరి గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల్లో వజ్రాల వేటకు వచ్చాడు. అయితే అక్కడ వజ్రాలు వెతికేందుకు వచ్చిన కొందరితో గొడవ జరిగింది. వారు రాళ్లు, కర్రలతో స్వర్ణయ్యపై దాడి చేశారు. అతని తల, ఎడమ చేతికి బలమైన గాయాలయ్యాయి. కొందరు స్థానికులు అతన్ని 108 వాహనంలో చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్ చోరీ

యాడికి: మండలంలోని రాయలచెరువు గ్రామంలో తాడిపత్రికి పోయే రహదారిలో ఉన్న ఇటుకల ఫ్యాక్టరీలో మంగళవారం రాత్రి దొంగలు మోటార్‌ను అపహరించారని యజమాని రామాంజనేయులు రెడ్డి తెలిపారు. రూ.50 వేల నష్టం జరిగిందన్నాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ శ్రీనివాసులు, సీఐ ఈరన్న

యాడికి: డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని తాడిపత్రి ఆర్టీఓ శ్రీనివాసులు సూచించారు. మండల కేంద్రంలోని బుగ్గ రోడ్డులో బుధవారం సీఐ ఈరన్నతో కలసి ఆయన వాహనాల తనిఖీ చేశారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకుని వెళ్తున్న 15 ద్విచక్ర వాహనాలు, ఆటోలను ఆపి జరిమానా విధించారు. రికార్డులను పరిశీలించారు. రోడ్డు భద్రత నియమాలు, వేగ నియంత్రణపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు



పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

పెద్దపప్పూరు: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పసలూరు, పెద్దపప్పూరు,వరదాయపల్లి, చిన్నయక్కలూరు గ్రామాల్లో బుధవారం పీర్లను భక్తులు గ్రామంలో ఊరేగించి జలధికి తరలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షించారు.

ఆర్థికసాయం అందజేత

తాడిపత్రి రూరల్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లోని బాలక్రిష్ణ కుటుంబానికి బుధవారం బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. వీహెచ్‌పీ సెక్రటరీగా పనిచేసిన బాలక్రిష్ణ గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబానికి అండగా ఉండేందుకు రూ.10వేలు ఆర్థికసాయం అందించామని నాయకులు లక్ష్మీనారాయణ, రాధాక్రిష్ణ తెలిపారు.

ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో నిరసన



మాట్లాడుతున్న అప్పారావు

గుంతకల్లు: స్థానిక రైల్వే డీజిల్ షెడ్‌కార్యాలయం వద్ద దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ సంఘ్ డీజిల్ షెడ్‌నాయకుడు అప్పారావు మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలన్నారు. ఖాళీగా ఉన్న రైల్వే ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలన్నారు. అంతేకాకుండా ప్రైవేటీకరణ విధానానికి స్వస్తి పలకాలన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా లారీ

గుత్తి: పట్టణంలోని రాయల్ సర్కిల్లో బుధవారం ఓ లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తింది. అరగంట పాటై లారీ రోడ్డుపైనే నిలిచిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చివరికి పోలీసులు కలుగజేసుకుని లారీని పక్కకు తొలగించడంతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.